www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 12 ఆగస్టు 2024



నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించ నున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలు తెలిపి పరిష్కరించుకుని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చింతతో ఉపాధి

• కుటీర పరిశ్రమగా వ్యాపారం • 10 వేల మందికి జీవనోపాధి

ప్రజాశక్తి -పుంగనూరు:

పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా చింత పండు కుటీర పరిశ్రమగా సాగుతోంది. దీని ద్వారా 10 వేల మంది ఉపాధి పొందు తున్నారు. ప్రభుత్వం మరింత ఆదుకుంటే ఉపాధికి చింత వుండదని చింత పండు కార్మికులు వాపోతున్నారు.

రాష్ట్రంలోనే చింతపండుకు పుంగనూరు ప్రసిద్ధి.. సుమారు అరవైయేళ్ల తర బడి పుంగనూరు నియోజకవర్గంలో సుమారు పది వేల మంది చింత కాయలను పండుగా తయారు చేసి జీవనం సాగిస్తున్నారు. గతంలో చింతచెట్లు విరివిగా ఈ ప్రాంతంలో ఉండేవి. జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకు చెట్లలో ఉన్న కాయలు రాల్చడం, వాటిని ఒబ్బిడి చేసి, కట్టికాయగా మార్చడంలో పురుషులు ఎక్కువగా ఉపాధి పొందేవారు. పుంగనూరులో కొన్ని ప్రాంతాలలో యజమానులు మండీలు ఏర్పాటు చేసి, చింత పండును కొట్టించేవారు. కాలక్రమేణ చింతచెట్లు తగ్గి, దిగుబడి తగ్గుముఖం పట్టింది. అయినా నేటికి చింత పండు వ్యాపారం అధికంగా కొనసాగుతూనే వుంది.

కుటీర పరిశ్రమగా వ్యాపారం

వ్యాపారం రీత్యా పుంగనూరుకు ఇతర వ్యాపారస్తులు కర్ణాటకలోని గుండల్‌పేట, మాండ్యా, చింతామణి, శ్రీనివాసపురం, సిరా, మహారాష్ట్రలోని ఔరంగాబాద్, నిజామాబాద్, బీహార్‌లోని రాంచి, జగదల్‌పూర్, రాయపూర్, తదితర ప్రాంతాల నుంచి సుమారు 25 వేల టన్నుల చింతకాయ(కట్టికాయ) దిగుబడి చేస్తారు. వాటిని ప్రజలు ఇళ్లకు తరలించి , పూ పండుగా తయారు చేసేందుకు పంపుతారు. ఈ పూ పండు తయారీలో సుమారు 10 వేల మందికి పైగా మహిళలు, ఉపాధి పొందుతున్నారు. సంవత్సరాంతం దిగుబడి చేసుకున్న చింతకాయ పట్టణంలోని ఏసీ గొడౌన్లలో నిల్వ ఉంచి, కాయను పూ పండుగా తయారు చేసి, మద్రాసు, చెన్నై, ప్రొద్దుటూరు, విజయవాడ, హైదరాబాదు, మంగళూరుకు తరలిస్తారు. జూన్ నుంచి అమ్మకాలకు సిద్ధం చేస్తారు. పూ పండును చపాతీలుగా, బిస్కెట్ లాగా వివిధ విధాలుగా తయారీకి 20 కేజీల కాయకు సుమారు 25 చపాతీలు , 20 కేజీల పూ పండుకు 75 అర కిలో బిస్కెట్ పేరుతో ప్యాకెట్లు తయారీ చేస్తారు. ఈ తయారీలో అధికంగా పుంగనూరులోని ఎన్ఎస్‌పేట, బీడీకాలనీ, ఉబేదుల్లా కాంపౌండు, కుమ్మరవీధి, భగత్‌సింగ్ కాలనీ, ప్రకాశం కాలనీ, చింతలవీధి, మేలుపట్ల, గాంధినగర్, తదితర ప్రాంతాలలో మహిళలు ఇంటి వద్దే ఉంటూ చింతపండు ద్వారా ఉపాధి లభిస్తుండడంతో ఈ వృత్తినే ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు.



చపాతీలుగా ప్యాక్‌చేసిన చింతపండు

10 వేల మందికి జీవనోపాధి

దీని ద్వారా సుమారు 10 వేల మందికి ఉపాధి లభిస్తోంది. కుటుంబాల వారి దినసరి 50 నుంచి 100 చపాతీలు తయారు చేస్తారు. కాయను కొట్టి, పూ పండుగా తయారు చేసి చపాతీలు తయారు చేస్తే ఒక్కో చపాతీకి రూ. 4 చొప్పున కూలీ చెల్లిస్తారు. పూ పండను ప్లాస్టిక్ కవర్లలో, బిస్కెట్ అర్ధకిలో ప్యాకెట్లలో వేసి ప్యాకింగ్ చేస్తే ఒక్కొక్క ప్యాకెట్‌కు రూ. 3 లు కూలీ చెల్లిస్తారు. ఈ విధంగా ఒక్కొక్కరు రోజుకు 80 ప్యాకెట్లు తయారు చేస్తారు. వయసును బట్టి ఈ పనిని ఎంచుకుని కుటుంబం వారు పండును వ్యాపారస్తులు కోరిన రీతిలో తయారు చేస్తారు. సుమారు 300 మందికి పైగా వ్యాపారస్తులు ఇళ్ల వద్దకే చింతకాయలు తరలించి, తిరిగి వారి వద్ద



చింత కాయల నుండి పండు వేరు చేస్తున్న కార్మికులు

నుంచి తెచ్చుకుంటారు. కాలక్రమేణ వర్షాలు సకాలంలో పడక , వ్యవసాయం, తదితర పనులకు కూలీలు బయటకు వెళ్లలేక మహిళలు ఈచింత పండు తయారీలో వర్షాకాలం మినహా సంవత్సరాంతం ఉపాధి పొందుతున్నారు. పట్టణంలో పలు చోట్ల మండీలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారుల వద్దకు ఇళ్ల వద్ద సౌకర్యం లేని వారు అక్కడికే వెళ్లి చింత పండు ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. పుంగనూరులో ఉన్న శీతల గిడ్డంగుల్లో సుమారు15 వందల లారీల చింతపండు నిల్వలో ఉన్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. కట్టకాయి రూ.30 నుండి 40, చపాతి రూ.110 నుండి 120, ఫ్లవర్ రూ.50 నుండి 100, కరుపులి రూ.92 నుండి 110 రూపాయలు ధరలు పలుకుతున్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి

కూలీలకు గిట్టుబాటు ధరలు లేక సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో అనేక సార్లు ఆందోళనలు, ధర్నాలు చేసి కొంతమేరకు పెంచుకున్నారు. ప్రభుత్వం తమను మరింత ఆదుకుంటే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని చింత పండు కార్మికులు పేర్కొంటున్నారు.

చిరుద్యోగులపై వేధింపులు మానుకోవాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు

ప్రజాశక్తి -పుంగనూరు:

చౌడేపల్లి మండలంలో స్కీం వర్కర్ల పై, చిరు ఉద్యోగులపై రాజకీయ నాయకులు వేధింపులు మానుకోవాలని ఆదివారం చౌడేపల్లి అంబేద్కర్ భవన్‌లో స్కీం వర్కర్ల సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, సిఐటియు మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర మాట్లాడుతూ మండలంలో వివోఏ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లపై వేధింపులు వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు . ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెదిరింపులతో స్కీం వర్కర్లను తొలగించడం ఏమిటి? అని ప్రశ్నించారు. వివోఏలను బైలా ప్రకారం కాకుండా ఏపీఎం, సీసీలు రాజకీయ నాయకులు చెప్పారనే ఉద్దేశంతో ఇష్టానుసారం బెదిరిస్తూ తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. మండలంలోనే కాకుండా పుంగనూరు నియోజకవర్గంలో రొంపిచర్ల మండలంలో ఇప్పటికే 17 మందిని తొలగించిన పరిస్థితి వుందని, ఇంత చేస్తున్నా జిల్లా అధికారులు చూస్తూ ఊరుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తున్న మండలాల ఏపీఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఆశా వర్కర్లపై అన్ని రకాల పనులు చేయిస్తూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, దీన్ని మానుకోవాలని డిమాండు చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్కీం వర్కర్లపై దాడి కొనసాగుతోందని గత ప్రభుత్వం పనినే ఈ ప్రభుత్వం కూడా చేయడం సరి కాదన్నారు. పై స్థాయిలో ముఖ్యమంత్రి దగ్గర నుంచి మంత్రుల వరకు వేధింపులు ఉండవని చెప్పినా కింది స్థాయిలో దానికి విరుద్ధంగా సాగుతోందని పుంగనూరు నియోజకవర్గంలో వేధింపులు తీవ్రస్థాయిలో ఉన్నాయని మానుకోకపోతే భవిష్యత్తులో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశం లో ఆశ యూనియన్ నాయకులు అనురాధ, సావిత్రి, విఓఏ సంఘం నాయకులు కార్మికుల పాల్గొన్నారు.

కేరళ వయనాడ్ బాధితులకు నిధి వసూలు

కేరళ వరద బాధితులను ఆదుకోవడానికి కార్మికులు ప్రజలు ఆర్థికంగా సహాయం చేసిన నిధులు వసూలు చేసి కేరళకు పంపుతున్నామని ప్రజల కూడా అందరు సహకరించాలని కోరారు.



కేరళ బాధితులకు సహాయ నిధిని సేకరణలో పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు

'హర్‌ఘర్ తిరంగ'ను విజయవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా లో ఈనెల 12 నుండి 15 వరకు విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.12వ తేదీ జాతీయ జెండా లతో సెల్ఫీ తీసుకొని పోస్ట్ చేయడం, పాఠశాలలు, కళాశాలలలో దేశభక్తికి సంబంధించిన , పాటలు, డ్రామాలు, మోనో యాక్షన్ తదితర కార్యక్రమాల నిర్వహణను డీఈఓ,ఆర్ ఐ ఓ డివిఈఓ నిర్వహించాలని, 13 వ తేదీ హర్ ఘర్ తిరంగా కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘ మహిళలు, ర్యాలీ ల నిర్వహణ డిఆర్డిఏ, మెప్మా వారి ఆధ్వర్యం లో నిర్వహించాలని, బిగ్ రన్ మారథాన్ ను డి ఎస్ డి ఓ, ఆర్ ఐ ఓ,డీఈవో,సమన్వయం తో నిర్వహించాలని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలలో జాతీయ జెండాను ఎగర వేయాలని,14 వ తేదీ జిల్లా,మండల, గ్రామ,వార్డు కార్యదర్శులతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహణను అర్బన్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు,గ్రామ పంచాయతీ పరిధిలో డిపిఓ పర్యవేక్షించాలని,ఈ కార్యక్రమం లో స్వాతంత్ర్య సమరయోధులు వారి కుటుంబీకులను గౌరవించాలని ఈ కార్యక్రమంలో డీఈవో, డిఎస్డివో, డి పి ఆర్ ఓ లు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆగస్టు 15 న జాతీయ జెండాను జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయంలో ఎవరు వేయాలని ఆదేశించారు.హర్ ఘర్ తిరంగా కార్య క్రమాన్ని గ్రామ, మండల, జిల్లా స్థాయి లో విజయవంతం చేయడం లో అన్ని శాఖలు సమన్వయంతో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.



అన్యాక్రాంత భూములను పరిశీలిస్తున్న విఆర్‌వో కుమార్

విఆర్‌ఓపై దాడి

ప్రజాశక్తి-గుడిపల్లి:

అన్యాక్రాంత భూమిని పరిశీలించేందుకు వెళ్లిన విఆర్‌వోపై కొందరు దాడికి పాల్పడిన సంఘటన మండ లంలో ఆదివారం చోటు చేసుకుంది. గుడిపల్లి మండలం నక్కనపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన సుమారు 14 ఎకరా ల 49 సెంట్లు ప్రభుత్వ గుట్ట పోరంబోకు భూమిని ఆక్రమించుకొని అక్రమంగా గ్రానైట్ రాళ్లను తరలిస్తూ అక్కడ కొబ్బరి మొక్కలను నాటుతున్నారని స్థానికులు అందించిన సమాచారంతో అక్కడికి వెళ్లిన రెవెన్యూ అధికారి కుమార్ పై గుండ్ల సాగరం ఆరుముగం, రాజేంద్ర గోవిందరాజులు అతనిపై దాడి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డిప్యూటీ తహశీల్దారుకు అతను సమాచారం అందించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ చేపట్టి అతనిపై దాడి చేసిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ శాఖ తెలిపింది. ప్రస్తుతం వీఆర్వో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుత్తార్లపల్లి గ్రామస్తులు అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకుని వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వెస్ట్ సర్కిల్ సీఐగా శ్రీధర్ నాయుడు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి శ్రీధర్ నాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్ఆర్ కడప జిల్లా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై వచ్చారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యం

- ప్రయాణికుల పాలిట శాపం
- ఆర్టీసీ అభివృద్ధి లక్ష్యం అంటున్న బాబు
- అధికారులను నిలదీసిన ప్రయాణికులు
- లక్ష్యానికి తూట్లు పడుతున్న వైనం

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కుప్పం నియోజకవర్గ శాసనసభ్యులు చంద్రబాబు ఆర్టీసీ అభివృద్ధితోనే కుప్పం ప్రక్షాళన మొదలు పెడతానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయన ప్రకటనకు కట్టుబడి కుప్పం ఆర్టీసీ డిపోను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు 112 సర్వీసులతో, లాభాల బాటలో పయనిస్తున్న కుప్పం ఆర్టీసీ క్రమేపి నష్టాలను చవిచూసింది. ఇందుకు కారణం గతంలో రాష్ట్రాన్ని పాలించిన వైసిపి నాయకులే అంటూ ముమ్మరంగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా 112 సర్వీసులతో ప్రజలకు సేవలందిస్తున్న కుప్పం ఆర్టీసీని, అప్పటి అధికార ప్రభుత్వమైన వైసీపీకి చెందిన ముఖ్య నాయకుడు, రాష్ట్ర మంత్రి కుప్పం నియోజకవర్గ శాసనసభ్యులు చంద్రబాబు పై కక్ష సాధింపులో భాగంగా కుప్పం ఆర్టీసీని సుమారు 60 సర్వీసులకు పరిమితం చేశారు. అందువల్లే కుప్పం ఆర్టీసీ నష్టాల బాట పట్టిందంటూ నేటికీ ప్రచారం జరుగుతోంది. ఇది ఒక ఎత్తు అయితే ఎలాంటి రాతపూర్వక ఉత్తర్వులు లేకపోయినా అప్పటి నాయకులకు కొమ్ముకాస్తూ అధికారులు కుప్పం ఆర్టీసీని దెబ్బతీశారన్న వదంతులు సైతం కుప్పం ప్రజలలో వినబడుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులు లేకపోయినా, నాయకుల నోటి మాటే శిరోధార్యంగా అధికారులు వ్యవహరించడం ఏమిటి?' అంటూ పలువురు సామాజిక కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఇది ఇలా ఉండగా 2024 ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గెలుపును సాధించి, టిడిపి జాతీయ అధ్యక్షులు, కుప్పం నియోజకవర్గ శాసనసభ్యులు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఎన్నికైన విషయం తెలిసిందే. అనంతరం ఆయన కుప్పం అభివృద్ధిలో భాగంగా ప్రయాణికుల శ్రేయస్సు కోరి 60 సర్వీసులకు పడిపోయిన ఆర్టీసీలో బస్సు సర్వీసులను పెంచుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు నూతన సర్వీసులను ప్రారంభించడంతోపాటు నూతన బస్సులను కూడా కుప్పం ఆర్టీసీ డిపో తీసుకొచ్చారు. అంతేకాక త్వరలో ఎలక్ట్రిక్ బస్ సర్వీసులను సైతం కుప్పం ఆర్టీసీ డిపోకు తీసుకువస్తామని టిడిపి నాయకులు, తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ప్రకటించారు. కుప్పం ఆర్టీసీని అభివృద్ధి చేసి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంటే, ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల కుప్పం ప్రజలతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు.



అధికారులను నిలదీసిన ప్రయాణికులు

ఆర్టీసీకి నూతన బస్సులు వస్తున్నా ఇప్పటికీ కాలం చెల్లిన బస్సులను నడపడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సామాజిక మాధ్యమాలలో సైతం విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇన్ని జరిగిన స్థానిక ఆర్టీసీ అధికారులలో మాత్రం చలనం లేదనే చెప్పాలి. అధికారుల అలసత్వం వల్ల ఆదివారం సైతం కుప్పం నుండి తిరుపతి వరకు ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని, అధికారులను నిలదీసిన ఘటన కుప్పం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చోటు చేసుకుంది. ప్రతిరోజు రాత్రి 7.30 గంటలకు కుప్పం నుండి తిరుపతి బస్సు సర్వీసు నడుస్తున్నట్టు ప్రయాణికులు తెలిపారు. ఈ సర్వీసును అధికారులు ఏమాత్రం ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆదివారం రోజు 7.5 గంటలకే నడపడం వల్ల ప్రజలు గంట సమయానికి పైగా బస్టాండులో పడిగాపులు కాయాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక 8.30 గంటలకు వెళ్లే బస్సులో రెండు బస్సులకు సరిపోయే జనం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయమై బస్టాండులో అందుబాటులో ఉన్న అధికారిని ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల 8.30 గంటలకు బయలుదేరిన బస్సులో డోరు వద్ద జనం వేలాడుతూ ప్రయాణించవలసిన పరిస్థితి ఏర్పడిందని, ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు?' అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పనిచేస్తున్న అధికారులను నేటికీ కొనసాగించడంతో కుప్పం ఆర్టీసీ అభివృద్ధి కుంటూ పడుతోందని, అధికారులు ముఖ్యమంత్రి లక్ష్యానికి వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తున్నారని ఆర్టీసీ ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వారి వైఖరిని మార్చుకుని, ఆర్టీసీ అభివృద్ధికి సహకరించి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



గోతులు, బురదమయంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

ప్రయాణంనరకప్రాయం!

గోతులు, బురదతో ఇక్కట్లు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల నుండి నంజంపేట పెద్ద ఉప్పరపల్లి ప్రాంతాలకు వెళ్లే వాహన చోదకులకు రోడ్డు గుంతల మయమై ప్రయాణం నరకప్రాయంగా మారింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వర్షానికి గోతుల్లో నీరుచేరి బురద మయంగా మారి ప్రయాణం దుర్భరంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. సోమల నుండి పెద్ద ఉప్పరపల్లికి 16 కిలోమీటర్ల దూరం మొత్తం అధ్వానంగా తయారై ద్విచక్ర వాహనాలు, కారులు, ఆటోలు, బస్సులు, లారీలు అధిక లోడు కలిగిన వాహనాలు వెళ్లాలంటే ఏ నిమిషానికి ఏ పరిస్థితి ఎదురవుతుందో ఎక్కడ ఏ గుంతలో దిగి వాహనం పక్కకి పడిపోతుందోనని భయాందోళనల మధ్య ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో అన్నెమ్మ గారి పల్లి, పెద్ద ఉప్పరపల్లి, ఆవులపల్లి, నంజంపేట పంచాయతీల నుండి సోమల, పుంగనూరు , పీలేరు తదితర ప్రాంతాలకు కళాశాల విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు నిత్యం ప్రయాణాలు చేస్తూ ఉంటారు. రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో ప్రయాణానికీ అధిక సమయం తీసుకుంటూ గమ్యం చేరే పరిస్థితి లేకపోతోందని స్థానికులు వాపోయారు. రైతులు తాము పండించిన పంటలను పుంగనూరు, పీలేరు, కలికిరి, దామలచెరువు తదితర ప్రాంతాల మార్కెట్లకు తరలిస్తూ ఉంటారు. ట్రాక్టర్లలో అధిక లోడుతో తరలించేటప్పుడు గుంతల మయమైన రోడ్డుపై వాహనం అటుఇటూ ఊగుతూ ఆందోళన కలిగి స్తోందని పేర్కొన్నా రు. గురువారం నంజంపేట, శుక్రవారం ఆవులపల్లి పెద్ద ఉప్పరపల్లి గ్రామాలలో వారపు సంతలు నిర్వహిస్తుంటారు. సంతలకు వెళ్లే వ్యాపారులు సైతం గుంతల మయమైన రోడ్లపై వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు ఈ ప్రాంత వాసుల ఇబ్బందులను గుర్తించి తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వతంగా తారు రోడ్డు వేసి గుంతల మయమైన రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

బిందు సేద్యం రైతుకు ప్రయోజనం

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

బిందు, తుంపర్ల సేద్యం నీటి వృథాను అరికట్టి రైతుకు ఎంతో ప్రయోజనం కల్పిస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లాలో గతంలో బిందు తుంపర్ల సేద్యం పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల అందరికీ అర్హతను బట్టి పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతంతో రైతుకు గరిష్ఠంగా రూ.2.18 లక్షల రాయితీ, ఐదు ఎకరాల నుండి పది ఎకరాలు కలిగిన రైతులకు 70 శాతం సబ్సిడీ గరిష్ఠంగా రూ.3.46 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. తుంపర్ల సేద్యం సన్నా, చిన్న కారు రైతులకు 55 శాతం రాయితీ, ఐదు ఎకరాల నుండి 10 ఎకరాలు కలిగిన రైతుకు 45 శాతం సబ్సిడీతో పరికరాలు అందిస్తామని చెప్పారు. 'ప్రజాశక్తి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఉద్యానవన శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ప్రజాశక్తి: ఈ ఏడాది బిందు తుంపర్ల సేద్యం జిల్లాలో ఎన్ని ఎకరాలు లక్ష్యం?

ఉద్యానవన శాఖ జిల్లా అధికారి: 2024-25 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 21,000 హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకున్నాం.. 100 రోజుల కార్యచరణ ప్రణాళిక లో భాగంగా 3,500 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించాం..

ప్రజాశక్తి: బిందు తుంపర్ల సేద్యం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?

ఉద్యానవన శాఖ జిల్లా అధికారి: మెట్ట భూముల్లో మామిడి, ఇతర ఉద్యాన పంటలకు బిందు, తుంపర పరికరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల సాగునీటి ఖర్చులు తగ్గించుకోవచ్చు. పంటకు పూర్తిస్థాయిలో నీటిని అందించి మంచి దిగుబడి పొందే అవకాశం ఉంటుంది.

ప్రజాశక్తి: బిందు, తుంపర్ల సేద్యం పరికరాల సబ్సిడీలు ఎలా ఉంటాయి.

ఉద్యానవన శాఖ జిల్లా అధికారి: బిందు తుంపర్ల సేద్యం పరికరాలు అవసరం అయ్యే రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను తెలియజేస్తూ బిందు, తుంపర సేద్యం పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల వివరాలు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద అందుబాటులో ఉన్నాయి. బిందు సేద్యానికి సంబంధించి సన్నా చిన్న కారు రైతులకు 90 శాతం రాయితీతో పరికరాలు అందిస్తాం.. ఐదు పది ఎకరాలు ఉన్నవారికి రాయితీ సబ్సిడీ కొంత తగ్గుతుంది. తుంపర సేద్యం పరికరాలు పొందేందుకు సన్న చిన్న కారు రైతులకు 55శాతం రాయితీ పొందే అవకాశం ఉంది.

ప్రజాశక్తి: బిందు తుంపర్ల సేద్యం జిల్లాలో ఏఏ శాఖలు అనుబంధంతో పనిచేస్తున్నాయి?

ఉద్యానవన శాఖ జిల్లా అధికారి: బిందు తుంపర్ల సేద్యం పరికరాలను పూర్తిగా ఉద్యానవన శాఖ ద్వారానే పంపిణీ చేస్తాం.. వ్యవసాయ, సిరికల్చర్, డ్వామా శాఖల అనుసంధానంతో సమన్వయం చేసుకొని జిల్లాలో ఉన్న ఉద్యానవన పంటలకు పరికరాలను అందిస్తాం..

ప్రజాశక్తి: ఉద్యానవన శాఖ ద్వారా రైతులు ఎలాంటి రాయితీలు పొందవచ్చు?

ఉద్యానవన శాఖ జిల్లా అధికారి: ఉద్యాన శాఖ అమలు చేస్తున్న పథకాల్లో సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ప్రధానమైంది. ఈ పథకం ద్వారా మామిడి, దానిమ్మ , జామ, అరటి, బొప్పాయి పంటల కొత్త సాగు విస్తీర్ణం పెంచడానికి 40 శాతం రాయితీ పొందవచ్చు. ఈ మొత్తాన్ని నాణ్యమైన మొక్కలు కొనుగోలు కోసం ఉపయో గించాల్సి ఉంటుంది. మామిడి పాత తోపుల పునరుద్ధరణ దిగుబడి పెంచేందుకు 50 శాతం రాయితీ, పూల సాగుకు 50 శాతం రాయితీ పొందవచ్చు. శీతల గిడ్డంగులు ఏర్పాటు అంటే ప్యాక్ హౌస్ ల ఏర్పాటుకు 50 శాతం శీతల గుడ్డలు ఏర్పాటుకు 35 శాతం రాయితీ పొందే అవకాశం వుంది.



ప్రహరీ నిర్మించండి..


ప్రహరీ లేని అంగన్‌వాడీ కేంద్రం

ప్రజాశక్తి-సోమల: సోమల దిగువ వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం1 భవనానికి ప్రహరీ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనానికి ప్రహరీ గోడ నిర్మించక పోవడంతో చెత్తాచెదారం అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరుతోందని వెంటనే ప్రహరీ నిర్మించాలని కోరారు. భవనం పక్కనే ఉన్న మురుగునీటి కాలువపై బండలు పరచాలని లేదంటే చిన్నారులు కాలువ దాటి వెళ్లే సమయంలో కాలువలో పడే ప్రమాదం వుందని తెలిపారు. ప్రహరీ నిర్మిస్తే లోపల ఖాళీ స్థలంలో పూల మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పిల్లలకు అందించవచ్చని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టి కాలువపై బండలు పరచాలని కోరుతున్నారు.

కళ్యాణ మండపానికి విరాళం


కళ్యాణ మండపానికి విరాళం అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలోని స్వయం భీశ్వర స్వామి ఆలయం పక్కన నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి భక్తుల నుండి విరాళాలు వస్తున్నాయి. మండల కేంద్రమైన సోమల లోని పచ్చి పులుసు విశ్వనాథ శెట్టి జ్ఞాపకార్థం కుమారుడు మంజునాథ్ పదివేల నూట పదహారు రూపాయలు, పచ్చి పులుసు ధనరాజ్ శెట్టి కుమార్తె ఐదువేల రూపాయలు, కామిశెట్టి అశోక్ ఐదువేల రూపాయలు, వొన్నూరప్ప గారి చిన్నక్క మూడు వేల రూపాయలు విరాళంగా ఆలయ ధర్మకర్త బివి సోమశేఖర్ కు అందించారు. ఈ కార్యక్రమంలో లింగన్న, చెన్నారాయప్ప పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పారిశుధ్యం పై దృష్టి పెట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. బంగారుపాలెం మండలం తగ్గువారిపల్లి పంచాయతీ అండ రెడ్డిపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కలో మురికి కాలువ లేక మురికి నీరు జాతీయ రహదారిపై ప్రవహించి దుర్వాసన వస్తోంది. పాదచారులకు ద్విచక్ర వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. పరిసరాల గృహాలు వారు దుర్వాసనను భరించలేక రోగాల బారిన పడుతున్నారు. మురుగనీరు ప్రవహించేందుకు ఉన్న దారులన్నీ మూసివేయడంతో ఒక స్థలంలో గుంటగా ఏర్పడి అటు తర్వాత రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీనివల్ల జాతీయ రహదారి మొత్తం గుంతలు ఏర్పడుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు మురికి నీటిని తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టి ప్రజల సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

షరీఫ్, శ్రీనివాసులును కలిసిన నియాజ్ అలీ


మాజీ శాసనమండలి చైర్మన్ షరీఫ్‌ను కలిసిన నియాజ్ అలీ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: విజయవాడలో మాజీ శాసన మండలి చైర్మన్ షరీఫ్, రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ ఆవల కొండ గ్రామానికి చెందిన నియోజక వర్గ టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి , తూగుండ్రం మాజీ సర్పంచ్ ఎస్‌హెచ్ నియాజ్ అలీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిరువురి దగ్గర నియాజ్ అలీ తన బయోడేటా కు సంబంధించిన కాపీలను అందించి నామినేటెడ్ పదవిని తనకు కేటాయించడానికి సీఎం చంద్రబాబు నాయుడుకు సిఫార్సు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు జాఫర్ , నేతలు నీరజాక్షులురెడ్డి, కండిగ శంకర్, దాసరపల్లె శంకర్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని బేలుపల్లి గ్రామంలో పురాతన దేవాలయాలయం 'గోపాలక్రిష్ణ స్వామి' కమిటీ సమావేశంలో రెండు లక్షల రూపాయలు దాతలు విరాళంగా అందించారు. గుడి అభివృద్ధికి అధ్యక్షులు రామాచంద్ర నాయుడు మాట్లాడుతూ బేలుపల్లి గ్రామానికి తలమానికంగా చోళరాజుల కాలం నాటి గుడి గొప్పగా పునర్నిర్మాణం చేయాలని చెప్పారు. కార్యదర్శిపిడుగు రమణ టిటిడి ఫండ్ కు దరఖాస్తు చేశామని సోమవారం వారి కమిటీ సభ్యులు పరిశీలనకు బేలు పల్లికి వస్తున్నారని చెప్పారు. గౌరవ అధ్యక్షులు బాల రాజు శెట్టి మాట్లాడుతూ అందరూ కలిసి గుడి నిర్మాణానికి సహకరించాలని తెలిపారు. ప్రముఖ దాత దశ గంధి శంకరశాస్త్రి విరాళం ప్రకటించారు. భూమి విరాళం దాత గణేష్ మొదలి అండ్ బ్రదర్స్, మాజీ సర్పంచి నారాయణ మొదలి, కార్యనిర్వాహక సహాయకులు కరమల గిరిధరమూర్తి, నాగరాజు నాయుడు , వెంకటప్ప, పంచాంగం శర్మ స్వామి, శల్య వైద్యులు యస్ లాల్ బాష, యస్ మణి, జయరాం ఆచారి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల బైరెడ్డిపల్లిలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ చికిత్సా శిబిరానికి మండలం లోని కంటి సమస్య ఉన్న ప్రజలు 40మంది హాజరయ్యారు. డాక్టర్ మురళీకృష్ణ .కంటి సంబంధించిన వివిధ చికిత్సలు నిర్వహించి వారిలో ఆపరేషన్‌కు 28 మందిని ఎంపిక చేశారు. వారికి చెన్నై శంకర నేత్రాలయ హాస్పిటల్‌లో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు అందించనున్నారు. వీరందరికి తిరిగి వారి ఇంటి వద్దకు ఉచిత ప్రయాణం ,భోజనం, వసతి, మందులు అందించనున్నారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి సహాయకులకు మధ్యాహ్న భోజనం, తాగునీరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో శంకర నేత్రాలయ డాక్టరు మురళి క్రిష్ణ, డాక్టరు శ్రీనివాసులు, రమణ చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం

- రిటైర్డ్ ఎస్‌పి, టీడీపీ నాయకుడు చిన్నస్వామి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: వైసిపి పాలనలో ఎస్సీ, ఎస్టీల హక్కులను కాలరాసి వారికి తీవ్ర అన్యాయం చేసింది మాజీ సీఎం జగన్ రెడ్డేనని రిటైర్డ్ ఎస్పీ పి.చిన్నస్వామి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులకు ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, రాజారెడ్డి రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలుపరిచిన జగన్ రెడ్డేనని విమర్శించారు. ఏపీలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు రాజకీయ లబ్ధి కోసం వైసీపీ చేసిందేన్నారు. కోనసీమ అంబేద్కర్ జిల్లా పేరుతో జగన్ కుట్రలు చేసి చిచ్చు పెట్టారని, అంబేద్కర్ విదేశీ విద్యా పేరును తొలగించి జగన్ పేరు ఎందుకు పెట్టారని 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి దళిత సంక్షేమాన్ని అడ్డుకున్నారని ప్రశ్నించారు.

నవంబర్‌లో శతాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

అఖిల భారత యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు తిరుపతి వేదికగా జాతీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అఖిల భారత యాదవ మహా సభ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.మహేశ్వరి తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్లో ఆమె మాట్లాడారు. మహా సభ 1922-24లో ప్రారంభించి 100 సంవత్సరాలు అవుతున్నందున శతాబ్ది ఉత్సవాల నిర్వహ ణ కమిటీ ఛైర్మన్‌గా జి.నరసింహా యాద్‌వ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవా లను నవంబర్‌లో నిర్వహిస్తామని, సీఎం చంద్ర బాబును ఆహ్వానిస్తామన్నారు. సమా వేశం లో నాగ మల్లేశ్వరీ, శేషపాణి యాదవ్, లక్ష్మి ప్రసా ద్, నారాయణస్వామి, దత్తాత్రేయ, శివ పాల్గొన్నారు.

కమ్మ సేవా సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:

మండల కేంద్రంలో కమ్మ సేవా కమిటి ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ముందుగా సంఘం సభ్యులు సమా వేశం నిర్వహించి పలు అంశాలను చర్చించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా గాలి చెన్నకేశవ నాయుడు, ఉపా ధ్యక్షులుగా చెరుకూరి మునిచంద్ర నాయుడు, జన రల్ సెక్రెటరీగా గణపతి మధు నాయుడు, సెక్ర టరీలుగా కందేరి వెంకటేష్ నాయుడు. ప్రసాద్, వేలూరు ప్రసాద్ నాయుడులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కన్నయ్య నాయుడు, గోపి నాయుడు, మధు నాయుడు, దయానాయుడు, చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట సీఐకి పలువురి అభినందనలు

ప్రజాశక్తి-రేణిగుంట:

రేణిగుంట అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కే.శరత్ చంద్రను ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో సత్కరించారు. సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాల గురించి సిఐకి జూలియన్ రాజు వివరించారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు లెజెండరీ పురస్కారాలు


లెజెండరీ పురస్కారాలు అందుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు

ప్రజాశక్తి -పుంగనూరు: రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, మదర్ థెరిసా, కోడి రామకృష్ణ లెజెండరీ పురస్కారాలను ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు అందుకున్నారు. ఆదివారం వారు పుంగనూరు లో మాట్లాడుతూ శనివారం అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదు రవీంద్ర భారతిలో పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ కృష్ణ మోహన్, సినీనటి ఫైజా జాన్, సినీ హీరో నరేందర్, అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సరోజనమ్మ, ఇతర అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథుల నుంచి పీలేరు కు చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక, సినీరంగ కళాకారుడు ఖాదర్ బాష షేక్ ఎన్టీఆర్ లెజెండరీ పురస్కారం, అల్లూరి సీతారామరాజు లెజెండరీ పురస్కారాన్ని స్క్రిప్ట్ రైటర్ షేక్ గౌస్ బాష, పద్య కవి జలకనూరి మురళీధర్ రాజు, తిరుపతికి చెందిన ఏఎస్ఐ దిగళ ప్రసాద్ రాజు, కోడి రామకృష్ణ లెజెండరీ పురస్కారాన్ని మాస్ కమ్యూనికేటర్, ఫైన్ ఆర్ట్స్ కమ్యూనికేటర్ డాక్టర్ తుంగ యోగేష్ బాబు, మదర్ థెరిసా లెజెండరీ పురస్కారాన్ని ఆంగ్ల భాష బోధకురాలు కె. విజిత యోగేష్, యాదమర్రి పి.హెచ్.పి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఏ. లక్ష్మీ నారాయణ, తిరుపతికి చెందిన నిర్మల్ చిత్ర కారిణి బత్తుల అర్చన, రాజీవ్ గాంధీ లెజెండరీ పురస్కారాన్ని వై. షామీర్ అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ తాము చేస్తున్న సేవలకు ఇలాంటి ఉత్తమ పురస్కారాలు అందడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు.

షూటింగ్ బాల్ విజేత గురుకులం విద్యార్థులు



ప్రజాశక్తి - రామకుప్పం: అంబేద్కర్ గురుకులం విద్యార్థులు షఉటింగ్ బాల్ పోటీల్లో పల్నాడు జిల్లా విద్యార్థులతో పోటీపడ్డారు. ఆదివారం వి కోట మండలంలోని జెడ్పీ హైస్కూల్లో షూటింగ్ బాల్ ఛాంపియన్షిప్ చివరి పోటీలు నిర్వహించారు. దీంతో పల్నాడు జిల్లా విద్యార్థులతో రామకుప్పం గురుకులం విద్యార్థులు ఆరుగురు పాల్గొని విజయం సాధించారని ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ నాయక్, అజిత్ నాయక్, అమర్నాథ్ రెడ్డి, శేషాద్రి, చరణ్, దినేష్ లను షూటింగ్ బాల్ కోచ్ జాబీర్, పి టి ప్రతాప్ విద్యార్థులను ఘనంగా అభినందించారు.

ఎంపిపి కార్యాలయం ముట్టడి

మండల సర్వసభ్య సమావేశం వాయిదా


మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించిన టిటిపి శ్రేణులు

ప్రజాశక్తి -వికోట : మండల పరిషత్ కార్యాలయాన్ని టిడిపి శ్రేణులు ముట్టడించడంతో మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గత సార్వత్రిక ఎన్నికల ముందు ఎంపీపీ యువరాజ్ టిడిపి నేతలకు విసిరిన సవాల్ స్వీకరించాలని టిడిపి నేతలపై గతంలో చేసిన తప్పుడు కేసులను నిరసిస్తూ టిడిపి నేతలు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అరుపులు, కేకలతో కార్యాలయ ప్రాంగణం మారుమోగింది. న్నికల ముందు విసిరిన సవాల్‌ను స్వీకరించాలని, ఎంపీపీ తన పదవికి రాజీనామా చేయాలని నాయకుల డిమాండ్ చేశారు. విషయం జిల్లా స్థాయి అధికారులకు తెలియడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. పోలీసుల సాయంతో ఎంపీపీ కార్యాలయం నుండి బయటకు వెళ్లారు. ఏమి జరుగుతుందోనని అధికారులు ఆతృతగా చూశారు. కార్యాలయానికి విచ్చేసిన జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు టిడిపి శ్రేణులతో చర్చించినా ఫలితం లేక పోయింది. సమావేశం జరగకపోవడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు వెనుతిరిగారు.

కాణిపాక బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఈవో సమావేశం


కాణిపాక బ్రహ్మోత్సవాలపై సమావేశం నిర్వహిస్తున్న ఈవో వెంకటేశు

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాక 2024 సంవత్సరం బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి మణికంఠేశ్వర స్వామి ఆలయంలో 14 గ్రామస్తులు ఉభయ దారులతో ఆలయ ఈవో వెంకటేశు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు ఈవో మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ నుండి 27వ తేదీ వరకు 21 రోజులు పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు ఉభయదారుల సహాయ సహకారాలతో వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఉభయదారుల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ బాబు, దేవస్థానం మాజీ ఛైర్మన్లు మోహన్ నాయుడు, జగన్నాథ రెడ్డి, మణి నాయుడు, మోహన్ రెడ్డి, కాణిపాకం సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్, దేవస్థానం ఏఈవోలు ఎస్ విశ్వష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, 14 గ్రామాల ఉభయదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ

ఎస్‌టియు ధర్నా వాయిదా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కలెక్టర్ హామీతో ఎస్‌టియు నాయకులు నేడు నిర్వహించతలపెట్టిన ధర్నాను వాయిదా వేసుకున్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాము పూర్తి స్థాయిలో సత్వర చర్యలు చేపడతామని కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఉదయం జడ్పీ కార్యాలయం ఎదుట ఎస్టీయు మహాధర్నా చేపట్టనున్న నేపథ్యంలో, కలెక్టర్ స్పందించి జెడ్పీ సీఈవో, జెడ్పీ ఛైర్మన్ లతో చర్చించారు . ఎస్టీయు నాయకులతో కలసి తన కార్యాలయంలో చర్చలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఎస్టీయూ నాయకులు ఆదివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ను కలసి వివిధ అంశాలపై ప్రాతినిధ్య లేఖలు సమర్పించారు . అనంతరం ఎస్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ మాట్లాడుతూ, జిపిఎఫ్ తరహాలో జడ్పిపిఎఫ్ ను మెరుగుపరచి, ప్రక్షాళన చేయాలని కోరారు. జడ్పిపిఎఫ్ నిర్వహణ లోపాల వల్ల పిఎఫ్ స్లిప్పులు అందుబాటులో లేవన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు పిఎఫ్ రుణాలు పొందాలన్నా, ఉద్యోగ విరమణ చెందేవారు తుది మొత్తాలు పొందాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు .జిల్లాలో టీచర్ల అందరికీ సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితాలు డీఎస్సీ ల వారీగా, క్యాడర్లవారీగా విడుదల చేయడంలో విద్యాశాఖ నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. దీనివల్ల టీచర్ల ఉద్యోగోన్నతులు, బదిలీలు రేషనైజేషన్ ప్రక్రియల సందర్భంలో అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతోందని తెలిపారు. కలెక్టర్, జడ్పీ సీఈఓ చర్చల అనంతరం ధర్నాను వాయిదా వేస్తున్నట్టు ఎస్టియు నేతలు తెలిపారు.

గంగమ్మ గుడి నిర్మాణంలో జాప్యం ఎందుకు ?

- ఆలయ నిధులపై వివరణ ఇవ్వాలి
- ప్రశ్నిస్తున్న18 ఆయకట్టు గ్రామాల ప్రజల

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఆరిమాకుల పల్లెలో వెలసిన ఆరిమాను గంగమ్మ ఆలయం నిర్మాణంలో జాప్యం ఎందుకని ఆలయ జమా ఖర్చులు విషయమై తయ్యూరు ఆయకట్టు 18 గ్రామాల ప్రజలు ఆదివారం గంగమ్మ ఆలయం వద్ద సమావేశమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. స్థానిక జడ్పిటిసి ఆలయానికి కార్యనిర్వాహకులుగా వ్యవహరించి రెండు సంవత్సరాల క్రితం బాగున్న ఆలయాన్ని కొట్టేసి కొత్త ఆలయం నిర్మిస్తామని చెప్పారని అప్పటినుంచి ఇంతవరకు ఆలయ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. ఆలయం అభివృద్ధి పేరిట పలువురు వద్ద నుంచి నిధులు సేకరించినట్లు ఆరోపణ చేశారు. ఆ నిధులపై వివరణ ఇవ్వాలని పలువురు కోరారు. ఈ విషయంపై ఆలయ ఈవో కి ఫోన్ ద్వారా వివరణ కోరారు. అనంతరం ఈ విషయాన్ని గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తీసుకెళ్లాలని అనంతరం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని గత మూడు సంవత్సరాలుగా ఆలయ జమా ఖర్చులను ఆలయ ఆవరణలోనే తయ్యూరు పాయకట్టు ప్రజలకు ఈవో వివరించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రస్తుత ధర్మకర్త లింగారెడ్డి, మంగుంట గ్రామానికి చెందిన హిమాచలపతి రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఆరిమాకులపల్లి సుబ్రమణ్యం నాయుడు స్థానిక సర్పంచ్ దామోదర్ నాయుడు, రఘునాథ్ నాయుడు, వివిపురం సిద్దయ్య శెట్టి, రఘునాథ్ రెడ్డి, తయ్యూరు వెంకటరమణ, శంకర్ రెడ్డి, 18 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

టిడిపి జెండాలు ఆవిష్కరణ



ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని గ్రామాల్లో టిడిపి జెండాలను ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని ఆవిష్కరించారు. ఆదివారం మండల కేంద్రం, బందార్లపల్లి, ఉన్సిగాని పల్లి, గౌరివిమాకులపల్లి, గిడ్డపల్లి, కెంపసముద్రం, తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల కోడ్ సమయంలో అధికారులు పార్టీల జెండాలు తొలగించడంతో నియోజకవర్గ నేతల ఆదేశాలతో పార్టీ జెండాలను ఆవిష్కరించామని నేతలు పేర్కొన్నారు. ప్రతి గ్రామాన టిడిపి జెండాను ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు, మునస్వామి, నందా రెడ్డి, రామకృష్ణప్ప, ముని రెడ్డి, విజయకుమార్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, అక్బర్ సాబ్, టీవీ రవి, నియాజ్, సుబ్రి,బాలు, వెంకటరమణ, అవినాష్, సతీష్, ఆదిల్, పెరుమాళ్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు: ఎస్ఐ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించవ ద్దని ఎస్ఐ వెంకట నరసింహులు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మైనర్లకు బైక్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్ప వని హెచ్చరించారు. లైసెన్సు, వాహన రికార్డులు లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపితే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలని సూచించారు.

'ప్రభుత్వం అందించే రుణాల ద్వారా అభివృద్ధి చెందాలి'



అవగాహన ర్యాలీ చేపడుతున్న స్వచ్ఛంద సంస్థ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: ఏపీ యానాది సంఘం - పరివర్తన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆదివారం మండలంలోని ఎర్రగుడిపాడు, గంగలపూడి, ఈశ్వరయ్య ఎస్టీ కాలనీలలో యానాదులు సంచార తెలుగు జాతుల సర్వే నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం అధ్యక్షులు చందమామల కోటయ్య, పరివర్తన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పల్లం అమర్నాథ్ సంయుక్తంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల వారి కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వం అందించే రుణాల ద్వారా చిన్నచిన్న వ్యాపారాలు చేసి అభివృద్ధి చెందాలని వివరించారు. అంగన్వాడి కేంద్రాలు అందుబాటులో లేని ఎస్టీ కాలనీలో అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరివర్తన స్వచ్ఛంద సంస్థ వాలంటీర్లు ఉష, గౌరీ, రమణ, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఇద్దరు నిందితుల అరెస్ట్

మూడు కేజీల గంజాయి స్వాధీనం


పోలీసుల అదుపులో వున్న నిందితులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పక్కా సమాచారంతో టౌన్ సిఐ జయరామయ్య ఆదివారం బండపల్లి చిత్తూరు రహ దారిపై నిఘా ఉంచి అటు వైపుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపే ప్రయత్నం చేశారు. పోలీసులను గమనించిన నిందితులు పారి పోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. చిత్తూరు నగరం మిట్టూరుకు చెందిన మదన్ (26), మనోజ్ (23)లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివిధ సెక్షన్లు నమోదు చేసి చిత్తూరు మండల డిప్యూటీ తహసీల్దారు ధనంజేయులు ద్వారా నిందితులను, 3 కేజీలు బరువు కలిగిన గంజాయిని ఒక మోటారు సైకిల్‌ను, రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో చిత్తూరు 1 టౌన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు. ఇలాంటి చర్యలు ఎవరికైనా తెలిస్తే పోలీసులు వారికి మీడియా ద్వార సమాచారం తెలిపి ఈ నేరాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెంకయ్యనాయుడుకు శుభాకాంక్షలు


మాజీ ఉపరాష్ట్రపతిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -గంగవరం: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు 75వ జన్మదినం సందర్భంగా ఆదివారం విజయవాడలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాధం నాయుడు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి చేస్తున్న భాషా సేవా కార్యక్రమాలను వివరించారు. వెంకయ్య నాయుడు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పుష్ప, మురళి పాల్గొన్నారు.

పాలేటమ్మ జాతరకు ఏర్పాట్లు సిద్ధం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నెల్లిమంద పంచాయతీ పాలేటమ్మ జాతర కోసం సోమల నెల్లిమంద పంచాయతీల నుండి అమ్మవారి కోసం చాందిని బండ్లు సిద్ధం చేసి ఊరేగింపుగా తీసుకు వెళ్లేందుకు తయారవు తున్నాయి. సోమల, గొల్లపల్లి నుండి రెండు, ఎగువపల్లి నుండి ఏడు, నెల్లిమంద పంచాయతీ పరిధి నుండి మరికొన్ని చాందిని బండ్లు సిద్ధం చేసి అమ్మవారి ఆలయం వద్దకు సోమవారం వేకువ జామున తీసుకువెళ్లి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ పరిసర ప్రాంతాల వద్ద విద్యుత్ అలంకరణలతో ధగధగ మెరుస్తోంది. సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

స్వయం ఉపాధికి నైపుణ్యం పెంచుకోవాలి



ప్రజాశక్తి -విజయపురం: సొంత ప్రాంతంలో స్వయం ఉపాధి పొందాలంటే తెలికపాటి నైపుణ్యం, శిక్షణ అవసరమని చెన్నైకి చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ నిష్ణాతులు ఉదయశంకర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గంగమాంబాపురంలో యువతకు, మహిళలకు శిక్షణా సమావేశాన్ని హాస్పిటల్ అడ్మిన్ శ్రీధరబాబు నాయుడు అధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాలలో ఎక్కువగా అందుబాటులో ఉండే ముడి సరుకు, వనరులను గుర్తించి వాటి ద్వారా ఆర్థికాభివృద్ధి పెంచుకోవ డానికి అనుగుణంగా స్కిల్ పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రెండు, మూడు డిగ్రీలు చేసి గృహిణిగా, నిరుద్యోగ యువత గా తిరుగుతున్నారని, వారు శిక్షణ తీసుకుంటే ఖచ్చింగా ప్రయోజకులు అవుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధి కో సం పలు స్కీములు అమలు చేస్తున్నదని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని, వ్యాపారం చేస్తూ పలువురికి ఉపాధి క ల్పించాలని కోరారు. యువతకు, గృహిణిలకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి వారిని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో వీ 2సీ సౌందర్రాజన్, టీడీపీ నాయకులు బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

క్రీడా రత్నాలు 'చందం' విద్యార్థులు


షుటింగ్‌బాల్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం చందం పంచాయతీ కొత్తఇండ్లు గ్రామం లోని విద్యార్థులు క్రీడా రత్నాలుగా ఎదుగుతున్నారని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు వి మార్కొండ నాయుడు కొనియాడారు. వికోట లోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో సబ్ జూనియర్స్ బాల బాలికల షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం జరిగాయన్నారు. ఈ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులలో 10 వ తరగతి చదువుతున్న ఎస్. భానుతేజ, వి. శకుంతల, జయశ్రీ లు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పథకాలతో పాటు మరిన్ని పతకాలను సాధించినట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులతో పాఠశాల వ్యాయమ దర్శకుడు ఎం. లోకనాథం ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి: ఎమ్మెల్యే


అతిసార బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి- బంగారుపాలెం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ అన్నారు ఆదివారం రాత్రి బంగారు పాలెం దళితవాడలో అతిసార బాధితులను పరామర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీరు శుద్ధి నీరు తాగాలని, వేడి పదార్థాల ఆహారాన్ని తీసుకోవాలని, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్య శిబిరంలో పరీక్షలు చేసుకుని చికిత్స చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికి వ్యాధి నయమయ్యే వరకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తామని వైద్య సిబ్బంది కొన్ని సౌకర్యాలు కావాలని విన్నవించాలని వాటిని వెంటనే ఏర్పాటు చేయనున్నట్టు వైద్య సిబ్బంది చేస్తున్న సేవకు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోక ప్రకాష్ నాయుడు , మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, ప్రధాన కార్యదర్శ జనార్దన్ గౌడ్, వైద్యులు లోహిత్ చంగల్ రాయలు, రమేష్ లోకేష్ పలువురు వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:

ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నింద్ర మండలం, సదాశివపురంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఈ శిబిరంలో 130మంది వైద్య పరీక్షలు చేసినట్లు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కోనేటి రవిరాజు తెలిపారు. కంటి, గుండె, ఎముకలు, దంతం, బిపి, షుగర్ వంటి సమస్యలున్న వారికి పరీక్షలు చేశారు. శిబిరంలో తిరుపతి మాధవి రెమిడీ హాస్పిటల్, డాక్టర్ ఎం.ఎం.కుమార్, డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ హరినాథ్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ అలోక్ కుమార్‌లు వైద్య సేవలందించారు. వీఆర్వో వెంకటేష్ టెక్నీషియన్ వనజ సర్పంచ్ జయమ్మ, అసోసియేషన్ అధ్యక్షులు బాబు, కార్యదర్శి రామ్మోహన్ వర్మ, సభ్యులు బాబు లీలావతి, అభిషేక్, వినోద్, వెంకటేష్ పాల్గొన్నారు.